# 'ఒక లవ్ స్టోరీ రాసి పెట్టండి సార్!'

తోటలో కొత్త చెట్లకు నీళ్ళు పెడుతూంటే, మా సందు మొగదలి ట్రంకు రోడ్డుమీద గుంటూరు బస్సు బ్రేకులేకుండా ఆగిన శబ్దం వినిపించింది. డీసిల్ ఆయిలింజన్నుంచి వెలువడ్డ పాడు పొగ- మా యింటిదాకా కమ్ముకొచ్చి, కాసే పటివరకు తోటలో పొడిమట్టిబెడ్డలమీద నీళ్ళు పాకినప్పుడు వచ్చే కమ్మని వాసననూ, మొన్ననే పెళ్ళగించిన సుగంధపు వేరుల సువాసననీ కొట్టేసి ఉక్కిరి బిక్కిరి చేసేసింది. ఇంతలోనే తోట కొయ్యగేటు కిర్రుమన్నది. చుట్ట పొగవదుల్తూ, చేతిలో పేటెంటు చర్మం పోర్టు ఫోలిమో వూగిస్తూ, ఒక బట్టతల పెద్దమనిషి ప్రవేశించాడు.

"ఏరా అబ్బీ! మీ యజమాని గారున్నారా?"

నేను మిలిటరీలో తిరిగొచ్చినవాణ్ణి. ఓనామాలురాని పాతకాలం డ్రిల్లు హవల్దారు మేజరు-"అరే బుద్దూ, సైతాన్" అని పిల్చినప్పుడూ, నేను రిక్రూటుగా వున్నప్పుడైతే యింకా కొంచెం పెద్ద డిగ్రీలో తిట్టిన తిట్లను భరించినప్పుడూ- నాకు శాంతం ఎందుకు అవసరమో వంట బట్టింది. "ఏమిరా అబ్బీ!" అని ఆ ఆగంతుకుడు పిల్చినప్పుడు ఆ పాత రోజులు జ్ఞాపకం వచ్చినై.

"తమకు ఏం కావాలో-?"

"కథలు రాసే ఆయన లేడూ-కథలు! పేపర్లలో రాస్తార్లే! మీ యజమాని మీ అయ్యగారు కావాలి. పో పిల్చుకురా." బట్టతల పెద్దమనిషి చుట్టను దూరంగా విసిరేసి, ముఖమంతా చిట్లించుకొని, యీ వ్యర్థుడితో ప్రసంగంవల్ల కాలహరణం అవుతున్నదనే జుగుప్సతో, నాకు చెముడున్నట్లు ముందుగానే గ్రహించినట్లుగా పెద్దగా అరిచాడు. నేను శామసమంతా అణచుకొని అన్నాను:

"నేనేనండీ యీ యింటి యజమానిని; వూసుబోక ఎప్పుడైనా కథలు రాసేది గూడా కద్దు. అలా దయచేసి కూర్చోండి."

ఆగంతుకుడి వళ్ళు నిజంగా మండింది,

"ఏమిటోయ్ వేళాకోళం! నేను ఎడిటర్ని. అంటే- సంపాదక మహాశ యుణ్ణి. నాది కొత్త పత్రిక. నాకు కథలు రాసే రాజుగారు కావాలి యిందా! యీ బేడబిళ్ళా తీసుకొనిపోయి బీడీలు కొనుక్కో-. ముందుపోయి మీ యజమానిని పంపించు. ఊఁ జల్దీ!" అంటూనే ఆయన నా మీదకు బేడ బిళ్ళ విసిరివేశాడు. అది నాకు తగలకుండా, అప్పుడే వంటింట్లో వాళ్ళ బామ్మ చేస్తున్న అరిసెల వాసనను పసిగట్టి -"నాన్నోయ్! తియ్యప్పచ్చులు నాన్నా! అప్పుడే కుండ నిండా చేసింది బామ్మ" అని శుభవార్త అందించవచ్చిన, కిస్సీ బాబుగాడికి తగిలింది. వాడు అసలు సంగతి గ్రహించక- "నాన్నోయ్! నాకు పెద్ద కానీ దొరికింది నాన్నోయ్!" అని గంతులేసుకుంటూ వచ్చి అక్కడే నుంచున్న ఎడిటరుగార్ని చూసి ఆగిపోయాడు.

నాది పాత ఖాకీ నిక్కరు, ముసలి బనియను, ఆ పైన ఒడలంతా స్వేదం. శబ్దాడంబరానికీ, వేషం బేషజానికీ విలువ నివ్వటం నేర్చుకొన్న ఆగంతుక సంపాదక మహాశయుడికి నేను సేవక స్వరూపంలో కనబడ్డం ఆశ్చర్యకరమైన విషయమేమీ గాదు కాని కత్తినీ, కలాన్నీ సమానంగా, వ్యష్టి సమష్టి ప్రయోజనాలకు శ్లాఘ్యపాత్రంగా వుపయోగించిన మా పూర్వీకుల యింటి ఆవరణలో-యీ అవమానాన్ని పాత సంతతి వారెవ్వరూ సహించి వుండేవారు గాదు. నేను యీ దశాబ్దం వాణ్ణిగదా! సవ్యమైన పద్ధతిలోనే ఆయనతో పరిచయా నికి పూనుకొన్నాను.

మా యిద్దరికి నిజమైన పరిచయమైన తర్వాత, ఆయన వచ్చిన పనిని త్వరగా, టూకీగా, సూటిగా, క్లుప్తంగా తేల్చేశారు. వారిది కొత్త ప్రతిక. ప్రస్తుతం 'లవ్' స్టోరీల్లో స్పెషలైజు చేస్తున్నది. ప్రెస్సు పనిమీద మా వూరి మీదుగా వెళ్ళాల్సి, పనిలో పనిగా దిగారు. నన్ను గూడా తప్పకుండా ఒక లవ్ స్టోరీ వ్రాసి యివ్వమని ఆహ్వానించారు. తగిన ప్రతి ఫలం వుంటుంది. 'రాయా లండోయ్ తప్పకుండా! పనిగట్టుక వచ్చినవాణ్ణి డిసపాయింటు చేయొద్దు' అని గేటు దాకా-అంటూ ఆయన వచ్చినంత ఆకస్మికంగానే నిష్క్రమించాడు.

కథలకు పోష్టు బిళ్ళలూ, తెల్ల కాయితాలూ, కవరుగూడా సప్లై చేసి, రచనలను ఆహ్వానించిన సంపాదకుల్లో వీరే ప్రథములై వుండాలి. ఎదురు చూడని యీ ఆహ్వానం గూడా- నిజంగా నేను పెద్ద రచయితనేమో- అన్నంత

అనుమానాన్ని గర్వాన్నీ తెచ్చిపెట్టింది. పది రోజులు కష్టపడి యీ కథ పంపించాను. కాని. యింకో నాలుగు రోజుల్లోనే. చిన్న వ్యాఖ్యతో సహా నా కథ తిరిగి వచ్చేసింది. యిట్లా వ్రాసివుంది. "నాకు లవ్ స్టోరీలు కావాలన్నాను. మీ కథలో అబ్బాయి లేడు. అమ్మాయి లేదు. సాధారణంగా యిద్దరమ్మాయిల్నో (యిద్దరబ్బాయిల్నో) మూడో వ్యక్తి ప్రేమించాలి. కొన్ని సంఘటనల తర్వాత ఒకళ్ళ ఆత్మార్పణ, మిగతా యిద్దరి వివాహం. నా పత్రిక చూస్తే మీరు గర్వపడతారు. కాని, ఇలాంటి తక్కువ కథనా, నే నాశించింది స్వామీ?'

ఈ కథను ఎవ్వరికి పంపినా యిది 'లవ్ స్టోరీ' కాదన్నారు. ఎవ్వరూ అచ్చువేయలేదు. అన్నిచోట్లనుంచీ తిరిగొచ్చింది. ఈ కథలో ఒక తండ్రీ, ఒక కొడుకూ, వాళ్ళ రక్తం, ఒక జెండా! ఉన్నవాటిని తేసివెయ్యలేదు. పోనీ-చదివిన మీరైనా చెప్పండి-యిది ప్రేమకథ అవునో కాదో!!

* * *

యుగాల కిందటి మాటలనుకొనేరు. కాదు - మొన్న మొన్నటి కథ.

సైన్యం నుండి విడుదల పొంది, ఆత్మలోని వాయుగుండంతో, కడుపులోని ఆకలితో - నిరాకారమైన భవిష్యత్తు కోసం, నల్లని వర్తమానం నుంచి అశలల్లుకొంటూ-నిరుద్యోగిగా, నిరీశ్వరవాదిగా, బొంబాయి మిల్లు జిల్లాల్లో నేను తిరుగాడుతూన్న దినాలవి. నాకూ యీ లోకానికీ మధ్య ఒక్కటే లంకె. ఒక్కటే ఆశ. ఒక్కటే మెరుపు. ఎందుకూ చెల్లనివీ, ఎవ్వరూ ఖాతరు చెయ్యనివీ, ఎవ్వరికీ చూపలేని నా దురభిమానం ఆవిరి కింద మగ్గిపోతున్న డిగ్రీ సర్టిఫికెట్లూ, రెకమెండేషన్ వుత్తరాలూ - ఏదో జరుగుతుంది, ఎవ్వరో పిలుస్తారు, ఎవ్వరో చూస్తారు - ఈ ఆకలి వెనకబడుతుంది, మనిషిగా బతకొచ్చు. అర్థంతో అన్ని వస్తువుల్నీ చూడవచ్చు. ఇదీ లంకె ఇదీ ఆశ. ఇదీ మెరుపు.

కాని, అది గూడా ఆ రోజుతో అంతమైంది. నాకంటే నిత్యదౌర్భాగ్యుడెవరో జేబు కాస్తా కొట్టేశాడు. నోట్లలాగా పొందుపరిచినవీ, ఓట్లకు గూడా కొరగానివి - నా సర్టిఫికెట్లతో ఆ జేబుదొంగ ఏంచేశాడో యిప్పటికీ అనూహ్యం. నా హృదయం తేలికైంది. కాకేమవుతుంది? ఆశ కోసం, మెరుపు కోసం బ్రతకనక్కర్లేదిక. చివరి లంకె తెగింతర్వాత వెనుకకు తిరిగి చూడనక్కర్లేదింక.

నడిచిపోతున్నాను. హఠాత్తుగా వెనగ్గుండా యూనిఫారంలో వున్న పోలీసు సిపాయి నన్ను భుజం పట్టుకొని గుంజి ఆపేశాడు.

'ఏమిటిది? ఎందుకు?' మళ్ళీ లంకె పట్టరాని కోపంతో నేను విదిలించుకొన్నాను.

పోలీసు సిపాయి నన్ను మరింత గట్టిగా పట్టుకొన్నాడు-'అక్కడ సమ్మె జరుగుతున్నది. స్ప్రింగు కత్తులకోసం అందర్నీ సెర్చి చేస్తున్నాం. రాత్రి పదిహేను మందిని పొడిచారు విన్లే?'-మరాఠీలో.

'నాకు తెలీదు. నాకు పట్టదు. నా జేబుల్లో ఏంలేదు. నేనునిరుద్యోగిని. అయినా నేనెందుకు పొడుస్తాను?'-హిందూస్తానీలో నా జవాబు.

బొంబాయిలో గూండాల సాధారణ ఆయుధం స్ప్రింగుచాకు.

సిపాయి నా జేబులన్నీ చూసి—'ఎందుకేమిటి? మిల్లుల్లో సమ్మె జరుగుతున్నది. సమ్మెగట్టిన వాళ్లు కడుపు మండి కొత్తగా పనిలో చేరినవాళ్ళను పొడుస్తున్నారు' అని వదిలేశాడు.

'పనిలోకి తీస్తున్నారా?'

'ఆఁ! జాగ్రత్తగా పో. లేక పోతే యీ లోపల్నే నీ పనీ పడతారు. కుడిచేతి రోడ్డుమీదుగా పోయి మళ్ళీ ముందుకు నడవక వెనక్కిపో. అక్కడ గుంపుంటుంది. పోలీసుల పక్కనే వున్న గుంపులో జొరబడు. మిల్లు లోనికి తీసికెళ్తారు పని దొరుకుతుంది.'

'చలో' అన్న సిపాయి మాటల్ని తిరిగి నేను వల్లించాను. 'చలో.' మొన్న ఒక్క పొద్దు తిండి, నిన్న చా నీళ్ళు, బన్ రోటీ ఖానా, యీవేళ యింకా ఏమీ లేదు. కాని, కాళ్ళకు బలం వచ్చింది. ఇంకో ఐదు నిమిషాల్లో నేను అక్కడ కొత్త పనివాళ్ల 'క్యూ'లో పోలీసుల అండతో నిలబడి వున్నాను.

మానవులమీద ఆకలికున్న విస్తృతాధికారాన్ని తలచుకొంటే హైందవ వేదాంతమేగాదు, జ్ఞానులు విజ్ఞానులు, రాగులు, విరాగులు బోధించిన సకల ధర్మాలకు అర్థం గోచరిస్తుంది. విప్లవజ్వాలల్నీ, విటకత్తెల్నీ, ధర్మజ్యోతినీ, అధర్మ యుద్ధాల్నీ, దానవులనూ, మానవులనూ అంత సులువుగా యింకే శక్తి సృష్టించగలదు? ఇంకే సంఘర్షణ ముందు యుగాల మానవ సంస్కృతీ, కరుణా పేకమేడవలె విచ్ఛిత్తి కాగలవు?

నాది ఆకలి నా పంక్తి ఆకలి పంక్తి. నాది ఆశ. నాది ఆకలి.

అటు చూశాను.

ఆ పంక్తిలో అర్ధాకలి. అశాంతి.

ఏది ధర్మం? ఏదధర్మం? ఎవరు చెప్పగలరీ తీర్పు? ఎవరి జ్ఞాన నేత్రాలు యీ విచక్షణా బీజాన్ని వరికించగలవు?

"ఏయ్!"

నా ముందున్న మనిషి ముందుకు నడిచాడు. ఆ తరువాత నా వంతు. రెండడుగులు వేశాను.

కొత్త మనుషుల్ని తీసుకుంటున్న ఫోర్‌మన్ నా వంక కొంచెం పరికించి చూశాడు. బహుశ యీ ముఖంలో ఆశతో, ఆకలితో మేళవమై కాలేజితో వ్యర్థ పరచిన నా వయసు గూడా కన్పించి వుండాలి.

"ఏం చదివావ్?"

"కాలేజీలో...."

"ఏం పని చెయ్యగలవ్?"

"ఏదైనా సరేనండీ....!"

"చౌకీదార్! ఈయన్ని అద్దకాల డిజైన్ల సెక్షనుకు తీసుకుపోయి దొరకు చూపించు - యిదిగో చీటీ...."

నేను చీటీ అందుకొని, స్వేదం తుడుచుకుంటూ చౌకీదారువంక తేరిపార జూశాను. వ్యక్తి మనుగడకూ, శాంతికీ, రక్షణకూ, స్వేచ్ఛకూ, స్వాతంత్ర్యానికీ - తోటి వ్యక్తి శత్రువై, సమస్యయై తేలినప్పుడు, ప్రతి అపరిచిత ముఖమూ ఒక పీడ కలగా, అగర్భశత్రు ప్రతిబింబంగా కన్పించిన ఆ రోజుల్లో- యీ తేరిపారజూడటం అలవాటయింది.

''హరేభాయ్....! హరీ!!''

''అరే - సాబ్ జీ! హమారా బాబూజీ!!''

అర్ధాకలి పంక్తిలోవున్న మనుషులు అరుస్తూనే వున్నారు. నావంక వేలు చూపి, పిడికిళ్ళూపుతూనే వున్నారు. నోటికొచ్చిన బండ తిట్లు తిడుతూనే వున్నారు.

'సాలా! మద్రాసీ!! హరామీ!!!'

ఆప్పట్లో బొంబాయి సమ్మెల్ని మద్రాసీలు వచ్చి భగ్నం చేస్తున్నట్లుగా కార్మికులందరికీ తెలుసు. గిరుక్కున వెనుదిరిగాను.

''మై మద్రాసీ నహీఁ! నహీహూ!! నహీహూ!!!''

నా శక్తి కొద్దీ అరిచాను. సమ్మె పంక్తులనుంచి పెద్దగా చప్పట్లు, యీలలు, తిట్లు. నా ముఖం కందగడ్డలా మారిపోయింది. కళ్ళనుండి రక్తపు చుక్కలు రాలగలవేమో ననుకొన్నాను.

''బాబూజీ! పర్వా మత్ కరో '' హరి నా చెయ్యి పట్టుకొని ముందుకు నడిపించుకెళ్ళాడు. కాని, అవమానం పిశాచిగా, అడవిలో అగ్నిగా, పిరికివాడి వూహగా, అనుమానస్తుడి బాధ స్తంగా వెన్నాడుతూనే వుంది.

ఈ కథ నాది గాదు, నన్ను గురించి గాదు- ఇది 'హరి' కథ.

హరి మరాఠా వృద్ధుడు. నేను క్వార్టర్ మాష్టరు డ్యూటీలో వుండగా, మా రెజిమెంటులో ఆర్డర్లీగా వున్నవాడు హరి. అతి నమ్మకస్థుడు. సక్కుబాయి, శివాజీ పుట్టిమెట్టిన సహ్యాద్రి శ్రేణిలో భగవద్భీతి లేని మరాఠా మన కెక్కడా కన్పించడు.

''బాబూజీ! ఈ సోమారివాళ్ళను గురించి ఆలోచించవద్దు, భయపడవద్దు. ఎంత గొప్ప పదవులు చూచిన వాళ్ళు తమరు? ఎంతటి వాళ్ళకు ఏమి గతి పట్టిందో యీ బేమానీలకు తెలుస్తుందా? నేను మనవి చేసేవాణ్ణే - బస్తీలకు వచ్చిన జనాలు మానం మర్యాద రెండూ మరచిపోతారు బాబూ!''

హరి మాటలు, అవమానాగ్ని తప్తుణ్ణయిన నన్ను హిమాలయ జలాశం లాగా శాంతపరచినవి.

"హరీ! ముసలితనంలో నీకూ యీ కర్మ తప్పలేదా?"

''తమకు తెలీందేముంది? దీనికోసం-'' పొట్ట చూపించాడు. ''కొడుకు ఎక్కొచ్చాడు. మిలిటరీలో వుండగా తమరి ద్వారా మనీ ఆర్డర్లు పంపేవాణ్ణి తెలుసుగా? కాని, చిల్లగాయి వెధవ. ఈ మిల్లులోనే మంచిపని దొరికింది. అయితే నేం? అడుగో - అక్కడున్నాడు.''

సమ్మెదార్ల వంక చేతులు వూపి హరి తన కొడుకును నన్ను గుర్తుపట్ట మన్నాడు. ఆకలి పన్నిన వుచ్చుల్లో, కుటల్లో తండ్రి యీ తాత్కాలిక శాంతినీ, కొడుకు ఆ నిరంతర అశాంతినీ పంచుకొన్నారు. ఒకరటు! మరొకరిటు!!

అద్దకాల డిజైన్ల సెక్షనులో యిన్‌ఛార్జి హేరిస్ దొర. లాంక్ షైర్ మిల్లుల్లో అసిస్టెంటుగా వుండి వచ్చిన హేరిస్‌ను ఫోర్మన్‌గా కుదిర్చారు. అతని పని గూడా చాలా యిరకాటంలో వుంది. ఆ మిల్లు ఎక్కువగా రంగు గుడ్డల్నే నేస్తుంది. అద్దకాల సెక్షనులో - సమ్మె మూలాన దాదాపు పని స్థంభించి పోయింది.

రంగు నీళ్ళ తొట్టినుంచి నా మీద ఒక్కసారి, ఒక్క క్షణం మాత్రం దృష్టి నిలిపి - చీటీ చదివి ''వెరీగుడ్! సమ్మె సంగతేమిటీ?'' అని ప్రశ్నించాడు.

ఈ ప్రశ్నకు నేను తయారుగా లేను. హరి మెల్లిగా సంజ్ఞ చేస్తూ - దొర చాలా మంచివాడన్న అర్థాన్ని నాకు అందించాడు.

''నాకేం తెలీదు, నేను నిరుద్యోగిని.''

''సమ్మె....!'' హేరిస్ మళ్ళీ చీటీ చూసి ''కాలేజీలో చదివినవాడివి- సమ్మె సంగతి సందర్భాలు తెలుసుకో లేదా?'' అని మళ్ళీ రంగు నీళ్ళ తొట్టిమీద దృష్టి నిలిపాడు.

''నాకు తెలీదు. పోలీసు సిపాయి యిక్కడ పనులున్నవని దారి చూపించాడు. వచ్చి 'క్యూ'లో నుంచున్నాను, అంతే.'"

హరి నాకు ఆసరాగా మాట్లాడాడు.

''ఏ సాబ్ పల్టన్ సాబ్ హై సాబ్!''

(యీ బాబు మిలిటరీలో వుండి వచ్చాడు).

హేరిస్ కొంచెం ఆలోచనలో పడ్డాడు,

"ఐసీ. నాట్ వర్కింగ్ క్లాస్ అబ్వియస్లీ! మీ తండ్రి వుద్యోగం?"

నే నాప్రశ్నకు జవాబివ్వ దలచుకోలేదు.

"నన్ను పనిలోనికి తీసుకొంటామన్నారు. నేను చేసింది తప్పయితే యిప్పుడే వెళ్ళిపోతాను.''

హేరిస్ నా కోపాన్ని గ్రహించి, భుజం మీద తట్టి, జిజ్ఞాసతో యిట్లా అన్నాడు:

"తప్పు లేదు. ఇండియాలో యిది ధర్మాధర్మ సమస్యగాదు. ఆకలి సమస్య. చావో - బ్రదుకో తేల్చుకోవాల్సిన మనిషి ఏ మార్గాన్ని అనుసరిస్తాడో అదే మీరు చేసింది గూడా. పని మానుకోవద్దు.''

"థాంక్యూ''

హేరిస్ నాతో కరచాలనం చేశాడు. హరిని చూసి చిరునవ్వు నవ్వి - "సీ దిస్ హరి! ఎగ్జాక్ట్లీ యిన్ యువర్ సిట్యుయేషన్. నిజానికి పక్కా రివల్యూషనరీ యీ హరి. ప్రాణమా? ధర్మమా? అన్న సమస్యే లేకపోతే సమ్మె పంక్తుల్లో వుండేవాడు కాని, ప్రాణంకోసం చాలా మంది కొత్త పనివాళ్ళను చేర్పించి సగం సమ్మెను దగ్ధం చేశాడు" అని విషాదంగా ముగించాడు.

నేను నిమిషానికి పదిసార్లు విఠోబా స్వామిని వుచ్చరించనిదే, వుండలేని మా పాత హరివంక చూశాను. ఆ ముఖంలో ఏ భావమూ గోచరించలేదు- దాగి వుండి దోబూచులాడుతున్న ఆకలి ఛాయలు తప్పితే.

తర్వాత నాకు తెలిసింది - హేరిస్ స్వదేశంలో కార్మిక పక్షానికి చెందిన వాడు. ఇక్కడ భుక్తి కోసం మేనేజిమెంటుతో వున్నాడు. ఏది ఎట్లయినా, హేరిస్ నేనూ ఆ క్షణంనుంచే స్నేహితులమైనాము. మానవతా, మార్దవమూ మూర్తీభవించిన మంచి ఆంగ్లేయుడు హేరిస్. మర్నాటి నుంచీ వెనక ఎప్పుడో ప్యాసు మార్కులకోసం చదివిన కెమిస్ట్రీని ఆసరా చేసుకొని నేను అద్దకాలకు కొత్త రంగుల్ని నిర్ణయించే పనిలో నిమగ్నుడనైపోయాను. కాని, అది నిమగ్నత కాదు.

* * *

ఏరోజు కారోజే ముగినిపోతుందనుకొన్న సమ్మె మూడు వారాలు గడిచినా విజృంభించి కొనసాగుతూనే వుంది. పోలీసులు, పికెటింగులు, లాఠీఛార్జీల మధ్య దినదిన గండంగా నా వుద్యోగం గూడా పొడుగు సాగుతూనే వుంది.

ప్రతి క్షణమూ చరిత్ర లిఖించబడుతూన్న ఎట్టిటి దినాలవి. ఏ పత్రిక చూచినా, ఏ రస్తాన నడిచినా, ఏ పట్నానికి పోయినా, ఏ దేశభక్తుడి ముఖాన్ని పరికించినా మూడే శీర్షికలు, మూడే నిశ్శబ్ద నినాదాలు, మూడే జిజ్ఞాసలు. ఆకలి, ఆవేశం, ఆంగ్లేయులు లేక ఆంగ్లేయులు, ఆవేశం, ఆకలి. దేశం అసేతు హిమాచల పర్యంతం అట్టుడికిపోతున్నది. ఆంగ్లేయులకూ, ఆహార ధాన్యాలకూ, సమ్మెలకూ నిరుద్యోగానికీ ఏ సంబంధం వుందో బజారులో మనిషికి శాస్త్రీయంగా తెలియకపోవచ్చును. కాని, అందరూ వుచ్చరించేది అదే. కారాగార క్లేశాలనుండి దేశనాయకులొచ్చారు. జెహాద్ నిషాలో వున్న జిన్నాకు యీ కాఫిర్లే అన్ని

అరిష్టాలకు కారకులుగా కన్పించారు. అంతర్యుద్ధమా? ప్రళయాంతకమా? మళ్ళీ ప్రపంచ సంగ్రామమా? చెంఘిజ్‌ఖాన్ పరిపాలనా? లేక సైనిక విప్లవమా?

ఆ వారపు రేషన్లు దొరికితే ఒక యుగం బదికినట్లుగా వుంది. ప్రజలకు రేషన్ మీద యిస్తూన్న ఆహార ధాన్యాలు ప్రాణదాన సమానమై పోయినవి.

మిల్లు ఆవరణలోనే ఆహార ధాన్యాలు, అటా, కిరసనాయిల్, పంచదార యిచ్చేవాళ్ళు. మేనేజ్‌మెంటే ఆ రేషన్ దుకాణాలను నడిపి, నెలకూలీలో నాలుగు వారాల రేషన్ల ఖరీదును మినహాయించుకొని మిగతాది బట్వాడా చేసేవాళ్ళు.

ఆ రేషన్ స్టోరుకే హరి చౌకిదారు. అతని పని స్టోరులోనేగాని మిల్లులో అతన్నెరగని వాళ్ళు వుండరేమో! ఆ మిలిటరీ పర్సనాల్టీని చూడగానే, ఆగి కులాసాగా కబుర్లు చెప్పనివాళ్ళు అరుదు.

సమ్మె సంరంభం మూడువారాల కిందటే మొదలయినా, మూడువారాలూ సమ్మెదార్లకు గూడా మామూలు ప్రకారం అప్పుమీద అందుతూనే వుంది రేషన్.

నాలుగో వారం అకస్మాత్తుగా రేషన్లు సమ్మె కార్మికులకు ఆపివేయ బడ్డయ్. మిల్లులో వున్నవాళ్ళకు మాత్రమే ఆహార ధాన్యాలందినయ్. అప్పటికే మూడు వారాల రేషన్లు నష్టపోయ్యాం అన్నారు మిల్లు యజమానులు.

కాదు, కడుపు మీద దెబ్బ అని కార్మికుల సమ్మె నాయకులరిచారు.

అయితే కావచ్చు, కడుపు మీద దెబ్బే.

ఎందుకీ వ్యర్థ ఘర్షణ? యుద్ధకాలంలో మన బట్టల మిల్లు కొత్త మార్కెట్లు సంపాదించింది. లాభాల్లో మీకు మంచి బోనస్సులిచ్చాం. కూలీల నుండి మీరు మధ్యతరగతిగా మారేందుకు జీవన ప్రమాణం పెంచాం. సమ్మె మానండి.

సమ్మె ఆగలేదుగదా - వికృతమైన హింసారూపం ధరించింది ఆ క్షణం నుండే. 144 సెక్షన్ వచ్చింది. కాని పికెటింగూ బలపడింది. ఆందోళనలో కేవలం అశాంతే గాదు, నెత్తురు ఆక్రోశం వినిపిస్తున్నది. సమ్మె చెయ్యనివాళ్ళు లోపలికి రావడమే దుస్సాధ్యకార్యమైపోయింది.

ఇంగ్లాండులో సమ్మె సందిగ్ధ విషపూరిత ఘడియల్లో గూడా కార్మిక యజమానుల సంబంధాలు ఎంత మర్యాదగా, హింసారహితంగా, నాగరీకంగా

వుంటాయో హేరిస్ చెబుతున్నాడు. పికెటింగు లైను కార్మికులకు, యజమానులు బన్ రొటీలు, కేకులూ, బీర్ సీసాలు ఒక్క ఇంగ్లండులోనే పంపించగల హృదయ వైశాల్యం కలిగివున్నారు.

వెనుదిరిగి చూస్తే నా రంగు నీళ్ళ ట్యూబుల వంక చూస్తూ నిశ్శబ్దంగా నిల్చివున్న హరి కన్పించాడు. స్టోరుకు తాళం వేశారు. తాళంమీద సీలువేశారు. కునికిపాట్లూ, ఆవలింతలూ భరించలేక యిట్లా వచ్చాడు.

హేరిస్ దొర కిటికీ తలుపులు తెరిచాడు.

"సమ్మె అటో యిటో యివ్వాళ తేలిపోవాలి."

"ఎట్లా?"

"మీ హరి నడుగు."

"ఏం హరీ?"

హరి నోటితో చెప్పలేదు. పొట్ట చూపించాడు మారుమాటాడకుండా నడిచివెళ్ళాడు మెట్ల కిందుగా.

సాయంత్రం సైరెన్ కూయగానే లేబొరేటరీ గది వరండాలోకి వచ్చినిలబడ్డాను. అక్కడి నుంచి కిందకు చూస్తే మమ్మల్ని క్షేమంగా బయటకు చేర్చే పోలీసు రక్షకదళం కనిపిస్తుంది సాధారణంగా. హరి ఆరోజున నన్ను కొంచెం ఆగమని కోరాడు. తన కొడుకుతో ప్రత్యేకంగా మాట్లాడాలని మరీ మరీ చెప్పాడు. హరి కోసం కిందకు చూశాను; కాని హరి రేషన్ స్టోరు ముందు లాఠీ పట్టుకుని నుంచొనే మామూలు ప్రదేశంలో లేడు.

బయట బ్రహ్మాండం బద్దలయ్యే కోలాహలం చెలరేగిపోతోంది. మెట్లమీద చప్పుడైంది. మిల్లు మేనేజింగ్ ఏజెంట్ మెట్ల మీంచి పరుగిడుతూ పోయి, టెలిఫోన్ గదిలో ప్రవేశించాడు. పోలీసు పార్టీ అంతా గేటుముందు కేంద్రీకరించి వుంది.

"రేషన్ లేయేంగే...."

"జరూర్ లేయేంగే ..."

"లడ్కే లేయేంగే...."

ఉప్పెన కదిలి వస్తున్నట్లు సమ్మె కార్మికులు నినాదాల్తో గేటు మీదికి తోసుకొస్తున్నారు. లోకంలో అన్ని క్రియలు ప్రక్రియలు ఆగిపోయి; యీ

భయానక హింసా పూరిత నినాదాలే తన ఒక్క క్రీడ అయినట్లుగా మారి పోయింది. మిల్లు జిల్లాఅంతా. రైఫిళ్లు గూడా గురిపెట్టలేక పోయారు పోలీసులు.

"లడ్కే లేయేంగే....

"రేషన్ లేయేంగే....హమారా

రేషన్"

గేట్లు ఫెట ఫెటమని విరిగి పడ్డవి. పోలీసులు వెన్నులు చూపకుండా ఒకే ఆర్డర్‌లో లోపలికొచ్చి పడ్డారు. ఇంకో యిరవై గజాల దూరంలో అసలు గుంపు తోసు కొస్తోంది.

పోలీసు జమేదార్-పైకి మావంక మోరబెట్టి-"లోపలికి పోండి-పోండి-కాల్పులు జరగబోతున్నై" అని అరిచాడు.

హేరిస్ ఏజెంట్‌తో మాట్లాడాడు. ఏజెంటు పెదిమ విరిచి - "మా చేతుల్నుండి జారిపోయింది. ఇక పోలీసుల యిష్టం"అని వరండాలోనుండి అదృశ్యమై పోయాడు. చాలా మంది గదుల్లోపల బల్లల క్రింద బోర్లాగిల పడి దాక్కున్నారు.

హేరిస్ నా చెయ్యి నొక్కి - "అడుగో హరి! ఇటీజ్ గోయింగ్ టుబి బ్లడీ (రక్తపాతం కాబోతుంది) యింకెందుకు అక్కడే వున్నాడు?" అని హరిని వేలితో చూపించాడు.

"లడ్కే లేయేంగే హమారా రేషన్...."

"లడ్కే లేయేంగే...."

పోలీస్ ప్లాటూన్ ఒక అర్ధ వృత్తాకారంలో రేషన్ స్టోరుచుట్టూ నిలబడి వుంది. మిల్లు గేటుదాటితే మొదట కనబడేదీ అడ్డొచ్చేదీ ఆ రేషన్‌స్టోరు గదే. పోలీసువృత్తంవెనక స్టోరు తలుపుల ముందు లాఠీతో నిలబడి వున్న హరి నాకు కన్పించాడు.

"చలో....రేషన్ లేయేంగే...."

గాలిలోకి బుర్రున రివ్వున రెండుగుళ్లు పోయినై.

పోలీసు వలయానికి యిరవై గజాల దూరంలోకి వచ్చిన గుంపు కొంచెం గందరగోళంగా తిరోగమించింది. ఒక్క క్షణంపాటుకాలం స్థంభించినట్లుగా నిశ్శబ్దం ఆవరించింది.

జమాదార్ కొంచెం ముందుకొచ్చి గుంపును అక్రమ సంఘంగా ప్రకటించాడు. ఆందోళన, హింస, దౌర్జన్యం, నినాదాలు చెయ్యరాదని పెద్దగొంతుతో క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లో హెచ్చరిక చేసి మళ్లీ తన ప్లాటూన్ మధ్యకు తిరోగమించాడు. రైఫిళ్లన్నీ అకాసంవైపు గురిపెట్టున్నయ్.

"లడ్కే లేయేంగే...."

జమేదార్ ప్రకటన ముందు నెలకొన్న నిశ్శబ్దం పటాపంచలై పోయింది. గుంపు మళ్లీ తోసుకొస్తున్నది.

"రేషన్ లేనా! నైతో మర్నా!!"

"కరో నై మరో!!"

ఒక కుర్రవాడు ముందు కొచ్చి గుంపు ముందు నిలబడి నినాదాలందిస్తున్నాడు. జనం తొక్కుకుంటూ కేకలేస్తూ అతని వెనకనే ఒక గజం తోసుకొచ్చింది.

గాలిలో రివ్వు....రివ్వు....రివ్వు....

తొమ్మిదిబార్లు జనం నెత్తిమీదుగా ఆకాశంలోకి పోయినై.

"విదేశ సర్కార్....ముర్దాబాద్."

జనంలో గాలిలో గుళ్ళను చూడగానే పుట్టిన సంచలనం, య్యా నినాదంతో విద్యుత్ ప్రసారపు షాక్ తగిలినట్లు విరిగిపోయింది.

"విదేశ సర్కార్ ముర్దాబాద్."

హేరిస్ నావంక చూశాడు అవును, ఆ నినాదం అతన్ని వరండాలో చూడగానే ఉద్భవించిన మాట నిజం. అవును, అక్కడ వర్గపోరాటం అంతరించింది. ఇక జాతీయతా స్వరూపం కప్పుకొన్నది- యీ చిన్న సమరం.

"లుక్! లుక్!!"- అన్నాడు హేరిస్.

అవును, ఆ కుర్రవాడు హరి కొడుకు. ఒకడు షోరాబ్, ఒకరు రుస్తుం.

"విదేశీ సర్కార్ ముర్దాబాద్."

వెనక నుంచి ఆ యువకుడి కెవరో జెండా అందించారు. అది మూడు రంగులున్న జెండా గాలిలోకి గర్వంగా జెండా నెత్తాడు హరి కొడుకు.

"విదేశీ సర్కార్ ముర్దాబాద్!"

యువకుడు జెండానెత్తాడు. కుడికాలు ముందుంచాడు. ఆ ఒక్క అడుగు పురోగమనానికి పది అడుగులు తోశారు వెనకనున్న జనం.

"లడ్కే లేయెంగే....రేషన్...."

జెండాను రేషన్ స్టోరుమీద ఎగరెయ్యాలని సమ్మెదారులిక నిశ్చయించుకొన్నారని ఆ కోలాహలం చెబుతున్నది.

"విదేశీ సర్కార్....ముర్దాబాద్...."

హేరిస్ గదిలోకి వెళ్ళిపోయాడు.

"లడ్కే లేనా భాయీ లోగ్...."

ఢాం ...ఢాం... ఢాం....ఢాం....

ట్రెంచీల్లో, టాంకుల్లో కూర్చుండి శతఘ్నుల మధ్య, పీనిగ పెంటల మధ్య పయనించిన వాడికి యీ సంఘర్షణ హనుమంతుడి ముందు కుప్పిగంతులుగా కనబడలేదు. ఈ విషాద ఘట్టం ఏ హృదయ విదారక యుద్ధ ఘట్టాన్నైనా మరపింపజేస్తుంది. కాల్పుల ముందు మెరుపులో నా సోల్జరు జీవితం క్షణికమాత్రంగా కనులముందు కదులాడింది.

జెండా యువకుడు జెండాతో నేలమీద కూలాడు. జెండా సగానికి ఒరిగింది, కాని, ఆసాంతం మృత్యు శీతలం కమ్మని క్రూరవాడి హస్తం నుండి యింకా పట్టు తప్పలేదు. ఈ మాటు నినాదాలు లేకుండానే జనం త్రొక్కిసలాడుతూన్నది వెనక్కీ ముందుకూ ఈ నరబలికి అర్థం గోచరించక, ఈ రక్తపాతానికి కళ్ళు చెదిరి, వెనక నుంచి ఆవేశం, ముందు నుంచి మృత్యువూ ఒత్తిడి పెడుతూంటే - మేరు పర్వతపు కవ్వానికి తాడుగా మారిన సర్పరాజు వాసుకి వలె బుసలు పెడుతున్నది. కాని, జెండా నంటటానికి, చిమ్ముతున్న యువరుధిరపు వేడిని మృత్యుశీతలం కమ్మకమునుపే గాలిలో దానిని నిలబెట్టేందుకు ఒక్క నాయకుడూ కన్పించలేదు.

హఠాత్తుగా కత్తులబోనునుండి కంఠనాదం గర్జించింది. "విదేశీ సర్కార్.... ముర్దాబాద్"

ఢాం....ఢాం....

కాని, మళ్ళీ గాలిలోకి.

అంతా పొగకమ్మింది. జెండా ఒరిగిపోతోంది. ఈ అర్థశూన్య వ్యష్టి బలిదానం, వ్యర్థమైన ఏకాంత వీరత్వంగా మారుతుంది యింకో క్షణంలో. సుందరమూ, విశ్వాస పూరితమూ, నిండు వనమూ గలిగిన ఒక జీవపు పతనం కోసమా యీ సమష్టి ఆవేశం? ఎవరిదీ జెండా? ఏమిటీ జెండా? ఏ చిహ్నం యిది? అనేమో తిరోగమించక పురోగమించక స్థబ్దమైన గుంపు సమష్టి ఆత్మ ఘోష!

కనుమూసి కనుతెరిచేలోపల పోలీసులు వెనుక తట్టునుండి ఒక వృద్ధుడు పరుగెత్తు కొచ్చాడు. అన్ని త్యాగాలకు అర్థం చూపిన జెండాను మృత్యు శీతల హస్తాలనుండి లాగుకొని పైకెత్తాడు జనం కేకలు వేయలేదు. చప్పట్లు కొట్టారు.

"విదేశీ సర్కార్...."

"హేరిస్ ... హారిస్...."

ఢాం....ఢాం....

నా పిలుపులకు హారిస్ వచ్చాడు. అప్పటికే మృత్యుధూమం కమ్ముతున్నది. చేతిలో జెండాతో, గుండెలో డండం - గుండుతో రేషన్ స్టోరుమీద కొడుకు పట్టిన జెండాను నాటటానికి పోలీసు వలయం నుండి రక్త ధారల్తో పురోగమిస్తున్న హరి మాకు కన్పించాడు.

స్టోరు మెట్లమీద భీష్ముడు కూలినట్లు, జెండాతోపాటు హరి కూలి పోయాడు.

''హేరిస్....''

''ఎస్....ఎ గ్రేట్ లవ్ స్టోరీ!''

మేం మెట్లు దిగివచ్చేసరికి, మిల్లు గోడలుదూకి జనమంతా పారిపోగా, చుట్టూ వచ్చి చేరిన పోలీస్ లారీలు కనిపించినై.

పోలీసులు పంచనామా వ్రాయిస్తున్నారు... ఒక కొడుకు, తండ్రీ - వాళ్ళ మధ్య ఒక జెండా, మూటినీ కలుపుతూ రక్తం....

ఆ మరునాడే నేనూ హేరిసూ హరి శవంకోసం మార్చ్యురీకి పోయాం.

(శారద మాసపత్రిక - 1960 దశకం)